సాక్షి
శ్రీకాకుళం
మంగళవారం । 2 । జనవరి । 2024



యాజమాన్య పద్ధతులతోనే..

మామిడి, జీడి మామిడిలో యాజమాన్య పద్ధతులే కీలకం. ఆ మేరకు అధికారులు సలహాలిస్తున్నారు.

- 8లో



రోడ్డు ప్రమాదాల్లో..

జిల్లా వ్యాప్తంగా జరిగిన వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో నలుగురు మృతి చెందారు. ఒకరు గాయపడ్డారు .

- 8లో

రిజిస్ట్రార్‌గా అడ్డయ్య బాధ్యతల స్వీకరణ



ఎచ్చెర్ల క్యాంపస్: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విశ్వవిద్యాలయం ఇన్‌చార్జి రిజిస్ట్రార్‌గా ప్రొఫెసర్ బిడ్డిక అడ్డయ్య సోమవారం బాధ్యతలు స్వీకరించారు. బోధన, బోధనేతర సిబ్బంది అభినందనలు తెలియజేశారు.

న్యూస్‌రీల్

ఎస్పీ రాధికకు 12 పే మ్యాట్రిక్స్ స్కేల్



శ్రీకాకుళం క్రైమ్ : ఎస్పీ జీఆర్ రాధికకు జూనియర్ అడ్మినిస్ట్రేటివ్ గ్రేడ్ లెవెల్ 12 పే మ్యాట్రిక్స్ స్కేల్‌ను ప్రభుత్వం కల్పించింది. రాష్ట్ర వ్యాప్తంగా పలువురు ఐపీఎస్ అధికారులకు ప్రభుత్వం ఈ సదుపాయం కల్పించగా.. ఎస్పీ కూడా ఆ జాబితాలో చోటు సంపాదించారు. ఈ సందర్భంగా జిల్లా పోలీసు యంత్రాంగం ఆమెకు అభినందనలు తెలిపింది.

రేంజ్ ఐజీగా హరికృష్ణ బాధ్యతల స్వీకరణ



ఐజీగా బాధ్యతలు స్వీకరిస్తున్న హరికృష్ణ

సాక్షి, విశాఖపట్నం: విశాఖ రేంజ్ ఐజీగా హరికృష్ణ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. రేంజ్ డీఐజీగా విధులు నిర్వహిస్తున్న హరికృష్ణకు ఐజీగా పదోన్నతి కల్పిస్తూ ఉత్తర్వులు జారీ చేసిన విషయం తెలిసిందే. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి, ఏపీ డీజీపీ కేవీ రాజేంద్రనాథ్ రెడ్డికి ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

లైఫ్ సర్టిఫికెట్ స్వీకరణకు హెల్ప్‌డెస్క్

శ్రీకాకుళం పాతబస్టాండ్: పెన్షనర్ల లైఫ్ సర్టిఫికెట్ స్వీకరణకు హెల్ప్ డెస్క్‌ను జిల్లా ఖజానా కార్యాలయంలో ప్రారంభించినట్లు ఉప సంచాలకులు సీహెచ్ రవి కుమార్ అన్నారు. జిల్లాలోని ఖజానా కార్యాలయం పరిధిలో గల పెన్షనర్లు లైఫ్ సర్టిఫికెట్ అందజేయాలని తెలిపారు. ప్రతి ఉప ఖజానా పరిధిలో కూడా పింఛన్‌దారుల సౌకర్యార్థం ఏర్పాటు చేశామన్నారు. పింఛన్‌దారులు ఫిబ్రవరిలోగా లైఫ్ సర్టిఫికెట్లను అందించాలని తెలిపారు.

పదోన్నతుల ధ్రువీకరణ పత్రాల అందజేత



పదోన్నతులు పొందిన ఉద్యోగులకు ఆర్డర్స్ అందిస్తున్న జెడ్పీ చైర్‌పర్సన్ పిరియా విజయ

కవిటి: కారుణ్య నియామకాలు, ప్రమోషన్లు జీవితాల్లో ఆనందాన్ని అందిస్తాయని జెడ్పీ చైర్‌పర్సన్ పిరియా విజయ అన్నారు. ఆమె సోమవారం మండలంలోని బల్లిపుట్టుగలోని వైఎస్సార్ సీపీ నియోజకవర్గ సమన్వయకర్త పిరియా సాయిరాజ్ క్యాంప్ కార్యాలయంలో పలువురికి ప్రమోషన్ల పత్రాలతో పాటు కారుణ్యనియామక పత్రాలను అందజేశారు. ఉద్యోగాలను సమర్థంగా నిర్వహించాలని సూచించారు. పదోన్నతులు పొందిన వారికి, కొత్త ఉద్యోగులకు అభినందనలు తెలిపారు.

ఆదిత్యాలయ వసతి గదులకు రూ.3 లక్షల విరాళం



రూ.3 లక్షల నగదును శంకరశర్మకు అందజేస్తున్న దాత సత్యారావు దంపతులు

అరసవల్లి: అరసవల్లి సూర్యనారాయణ స్వామి ఆలయంలో భక్తుల వసతి గదుల నిర్మాణానికి నగరానికి చెందిన వ్యాపారవేత్త కోరాడ సత్యారావు, మాధవి దంపతులు రూ.3 లక్షల విరాళాన్ని సోమవారం ప్రధానార్చకులు ఇప్పిలి శంకరశర్మకు అందజేశారు. ఆలయ పాలకమండలి సభ్యులు మండవిల్లి రవి ఆధ్వర్యంలో దాత కుటుంబ సభ్యులు ముందుగా ఆదిత్యుడిని ప్రత్యేకంగా దర్శించుకుని, వసతి గదులకు గాను నూతన సంవత్సరం సందర్భంగా రూ.3 లక్షల నగదును అందజేశారు. ఈ సందర్భంగా మండవిల్లి రవి మాట్లాడుతూ.. మంత్రి ధర్మాన పిలుపు మేరకు తామంతా దాతల సహకారాన్ని అభ్యర్థిస్తున్నామని, దీంతో అరసవల్లి ఆలయాన్ని సౌకర్యాల పరంగా అభివృద్ధి చేసేలా కృషి చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో ఆలయ సిబ్బంది, దాత కోరాడ సత్యారావు కుటుంబ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.





• వేకువ..

కోటి ఆశలకు ప్రతి రూపంగా కొత్త వేకువ కనిపించింది. నూతన ఏడాదికి స్వాగతం పలుకుతూ ఇలా తూరుపు తీరాన కడలి కడుపు నుంచి ఉద్భవించింది. - సాక్షి ఫొటోగ్రాఫర్, శ్రీకాకుళం

• వేడుక

తీరంలో నూతన సంవత్సర వేడుక అంబరాన్ని తాకింది. కొత్త ఏడాది సందర్భంగా పుక్కళ్లపాలెం తీరం జనంతో నిండిపోయింది.

- కవిటి

విద్యా విప్లవం వినూత్న బోధనం



ఓ తరగతి గదిలో స్మార్ట్ టీవీలో బోధన చేస్తున్న ఉపాధ్యాయుడు

- విద్యా రంగంలో సరికొత్త సంస్కరణలు
- ప్రభుత్వ పాఠశాలలు, కాలేజీల్లో స్మార్ట్ పాఠాలు
- ఐఎఫ్‌పీ ప్యానల్స్, స్మార్ట్ టీవీల ఏర్పాటు
- దృశ్య, శ్రవణ విధానంలో పాఠ్యాంశాల బోధన



కొయ్యాం జీజేసీ కళాశాలలో ఐఎఫ్‌పీ వాడకంపై సిబ్బందికి అవగాహన కల్పిస్తున్న కంపెనీ ప్రతినిధి

శ్రీకాకుళం న్యూకాలనీ: తరగతి గదులు అతి గొప్ప మార్పులకు సాక్షిగా నిలుస్తున్నాయి. ఇన్నాళ్లూ నల్లబల్ల సాయంతో సాగిన చదువులు ఇప్పుడు ఐఎఫ్‌పీ ప్యానెళ్లు, స్మార్ట్ టీవీల స్థాయికి ఎదిగాయి. పుస్తకాల వరకే పరిమితమైన బోధన ఇప్పుడు టీవీ వంటి సాధనాల వరకు పెరిగింది. విద్యా వ్యవస్థలో అనేక విప్లవాలకు నాంది పలికిన వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం సర్కారు పాఠశాలల్లో డిజిటల్ బోధనను పరిచయం చేసింది. దృశ్య, శ్రవణ మాధ్యమాల ద్వారా పాఠ్యాంశాలు బోధిస్తోంది.

జిల్లాలో ఇది పరిస్థితి..

వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధికారంలోకి వచ్చినప్పటి నుంచి విద్యారంగంలో అనేక సంస్కరణలకు శ్రీకారం చుట్టారు. గతంలో డిజిటల్ తరగతి గది పాఠశాలకు ఒకటి మాత్రమే ఉండేది. అది కూడా జిల్లా పరిషత్ పాఠశాలల్లోనే అందుబాటులో ఉండేది. ఒకవేళ ఉన్నా పూర్తి స్థాయిలో వినియోగించుకోలేని పరిస్థితి. అలాంటి పరిస్థితికి ప్రస్తుతం చెక్ పడింది. 1వ తరగతి నుంచి 5వ తరగతి వరకు స్మార్ట్ టీవీలు, 6 నుంచి ఇంటర్మీడియెట్ వరకు ఇంటరాక్టివ్ ఫ్లాట్ ప్యానెల్స్(ఐఎఫ్‌పీ) ద్వారా బోధన అందిస్తున్నారు. 8వ తరగతి విద్యార్థులకు రాష్ట్ర ప్రభుత్వం రెండేళ్లుగా ట్యాబ్‌లు అందజేస్తోంది. అందులో 8 నుంచి ఇంటర్ వరకు బైజూస్ సంస్థకు చెందిన డిజిటల్ పాఠాలను అప్లోడ్ చేసి అందజేస్తోంది. ఇలా సర్వం డిజిటల్ విధానంలో ప్రస్తుతం బోధన సాగుతోంది.

అర్థమయ్యేలా..

జిల్లా వ్యాప్తంగా తొలి దశలో 333 ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలల్లో డిజిటల్ విద్యా బోధన అమలు చేస్తున్నారు. ఇందులో భాగంగా 452 స్మార్ట్ టీవీలు, 1923 ఐఎఫ్‌పీలు అమర్చారు. ఐఎఫ్‌పీలలో 375 పాఠశాలల్లో 1644 అందజేయగా, 38 జూనియర్ కళాశాలల్లో 279 మంది అందించారు. వీటిని తరగతి గదుల్లో బిగించి సిద్ధం చేశారు. ప్రస్తుతం వీటితోనే బోధన కొనసాగిస్తున్నారు. ఐఎఫ్‌పీ ప్యానెల్స్, స్మార్ట్ టీవీల ద్వారా సులభతరంగా పాఠ్యాంశాలు అర్థమయ్యే రీతిలో బోధిస్తున్నారు. గ్రాఫిక్స్ విధానంలో సులువుగా పాఠాలు అర్థమవుతున్నాయి.

ట్యాబ్‌లు అందజేత.. ప్రత్యేకంగా పర్యవేక్షణ

ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు, పాఠ్యాంశాలు బోధించే ఉపాధ్యాయులకు ప్రభుత్వం ట్యాబ్‌లు అందజేస్తోంది. గత (2022–23) విద్యా సంవత్సరంలో 25953 ట్యాబ్‌లను పంపిణీ చేశారు. ఇందులో 22,982 మంది విద్యార్థులకు, 2971 ట్యాబ్‌లు ఉపాధ్యాయులకు అందజేశారు. ప్రస్తుత విద్యా సంవత్సరానికి(2023–24) 22,318 మంది 8వ తరగతి విద్యార్థులకు ట్యాబ్‌లను అందజేస్తున్నారు. ప్రస్తుతానికి 10,050 ట్యాబ్‌లను అందజేశారు. మిగిలిన ట్యాబ్‌లను మరో వారం రోజుల్లో అందజేయనున్నారు. మరోపక్క డిజిటల్ బోధనను విద్యాశాఖ అధికారులు పకడ్బందీగా పర్యవేక్షిస్తున్నారు. ట్యాబ్‌లో ఉన్న పాఠాలను రోజూ చదవాల్సి ఉంటుంది. ప్రతి శుక్రవారం 10 నుంచి 15 నిమిషాల పాటు ఇంటర్నెట్ కనెక్ట్ చేసుకోవాల్సి ఉంటుంది. ఆ సమయంలో విద్యార్థులు ట్యాబ్ వినియోగించిన తీరు, ఎంత సేపు చదివారు, ఎన్ని పాఠాలను చూశారన్న ఆన్‌లైన్ డేటా ద్వారా సమాచారం ఎప్పటికప్పుడు ఉన్నతాధికారులకు చేరుతుంది. సమాచారాన్ని పరిశీలించిన ఉన్నతాధికారులు ఆయా పాఠశాలల హెడ్ మాస్టర్లను అప్రమత్తం చేస్తున్నారు. ట్యాబ్‌లో నెలకొంటున్న సాంకేతిక సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరిస్తున్నారు. ఆయా సచివాలయాల పరిధిలోని ఎడ్యుకేషన్ వెల్ఫేర్ అండ్ డిజిటల్ అసిస్టెంట్లకు బాధ్యతలను అప్పజెప్పారు. ట్యాబ్‌లలో తలెత్తుతున్న సమస్యలకు త్వరితగతిన చెక్ పెడుతున్నారు.

డిజిటల్ బోధన అద్భుతం



సీఎం వైఎస్ జగన్ ఎంతో దూరదృష్టితో ఆలోచన చేశారు. రాష్ట్ర ప్రభుత్వం తీసుకొచ్చిన డిజిటల్ విద్య అద్భుతమనే చెప్పాలి. గతంలో బ్లాక్‌బోర్డుకు పరిమితమైన చదువులు ప్రస్తుతం స్మార్ట్ టీవీలు, ఐఎఫ్‌పీల ద్వారా బోధన కొనసాగుతున్నాయి. దృశ్య, శ్రవణ రూపకంగా చెప్పడం, బోధనతో విద్యార్థుల హాజరు శాతం కూడా గతం కంటే పెరుగుతోంది. – డాక్టర్ రోణంకి జయప్రకాష్, ఏపీసీ, సమగ్రశిక్ష ప్రాజెక్ట్ శ్రీకాకుళం జిల్లా

ఆసక్తి పెరిగింది..



జిల్లాలో మొదటి ఫేజ్‌లో నాడు–నేడు పనులు జరిగిన బడుల్లో అందజేస్తున్న డిజిటల్ విద్య సక్రమంగా అమలయ్యేలా చర్యలు తీసుకుంటున్నాం. 8వ తరగతి విద్యార్థులకు అందజేసిన ట్యాబ్‌ల ద్వారా బైజూస్ కంటెంట్‌తో తరగతులు చెప్పిస్తున్నాం. ఇంటర్ వరకు బైజూస్ కంటెంట్ అప్‌లోడ్ చేస్తున్నాం. విద్యార్థులకు స్మార్ట్ బోధనపై ఆసక్తి పెరిగింది. – కె.వెంకటేశ్వరరావు, జిల్లా విద్యాశాఖాధికారి శ్రీకాకుళం జిల్లా

జిల్లా గణాంకాలు

జిల్లాలో ప్రభుత్వ పాఠశాలలు	2,654
విద్యార్థుల సంఖ్య	2,02,115
ప్రాథమిక పాఠశాలలు	1,940
ప్రాథమికోన్నత	307
ఉన్నత పాఠశాలలు	407
అందజేసిన స్మార్ట్ టీవీలు	452
స్కూళ్లు, కళాశాలలకు అందజేసిన ఐఎఫ్‌పీ ప్యానెల్స్:	1,923
గత ఏడాది అందజేసిన ట్యాబ్‌లు:	25,953
ఈ ఏడాది అందజేస్తున్న ట్యాబ్‌లు:	22,318



లారీ సిబ్బంది నిరసనతో ట్రాఫిక్‌కు అంతరాయం



కొర్లాం జాతీయ రహదారి వద్ద ఆందోళన చేపడుతున్న లారీల సిబ్బంది

సోంపేట: మండలంలోని కొర్లాం జాతీయ రహదారి వద్ద సోమవారం లారీల సిబ్బంది నిరసన తెలియజేయడంతో ట్రాఫిక్‌కు అంతరాయం కలిగింది. ఇటీవల కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన నూతన చట్టంతో లారీ డ్రైవర్లకు తీవ్ర ఇబ్బందులు తలెత్తుతాయని వారు తెలిపారు. ఆ చట్టాన్ని వెనక్కి తీసుకోవాలని ఆందోళన చేపట్టారు. దీంతో సుమారు 3 కిలోమీటర్ల మేర వాహనాలు నిలిచిపోయాయి. బారువ పోలీసులు సర్దిచెప్పడంతో ఆందోళన విరమించారు.

ఆమె నేత్రాలు సజీవం



నేత్రదానం చేసిన రామలక్ష్మి

శ్రీకాకుళం కల్చరల్: నగరంలోని మొండేటి వీధిలో నివాసం ఉంటున్న తాళాసు రామలక్ష్మి (86) బ్రెయిన్ స్ట్రోక్‌తో మృతి చెందారు. ఆమె కుమారుడు తాళాసు తాడు తల్లి కళ్లను దానం చేయాలని నిర్ణయించుకుని రెడ్‌క్రాస్ చైర్మన్ పి.జగన్మోహన రావుకు తెలియజేశారు. దీంతో మగటపల్లి కల్యాణ్ నేత్రసేకరణ కేంద్రం ద్వారా ఆమె కార్నియాలు సేకరించి విశాఖలోని ఎల్వీ ప్రసాద్ నేత్రసేకరణ కేంద్రానికి అందజేశారు. దాత కుటుంబ సభ్యులను చైర్మన్ అభినందించారు.

నేత్రదానం చేయాలనుకునే వాళ్లు **78426 99321** నంబరుకు కాల్ చేయాలని కోరారు.

'గాలికుంటు టీకాలు సద్వినియోగం చేసుకోండి'

కాశీబుగ్గ: రాష్ట్ర వ్యాప్తంగా ఈ నెల 2వ తేదీ నుంచి వచ్చే నెల 2వ తేదీ వరకు మూగజీవాలకు ఎఫ్‌ఎండీసీపీ(గాలికుంటు నివారణ) టీకాలు ప్రభుత్వం ఉచితంగా అందిస్తుందని, గొర్రెల, మేకల కాపరులు, పెంపుడు జంతువుల కాపరులు సద్వినియోగం చేసుకోవాలని రాష్ట్ర పశుసంవర్ధక, పాడి పరిశ్రమల మత్స్యశాఖ మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు అన్నారు. సోమవారం మంత్రి క్యాంప్ కార్యాలయం వద్ద ఎఫ్‌ఎండీసీపీ పోస్టర్‌ను ఆవిష్కరించారు. నెల రోజుల పాటు ఉచితంగా ఇంటింటికీ తిరిగి పశువులకు టీకాలు వేస్తారని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా పశుసంవర్ధక శాఖ జేడీ డాక్టర్ ఎం.కిశోర్, గొర్రెల మేకలు పెంపకదారుల సహకార సమితి చైర్మన్ రాపాక చిన్నారావుయాదవ్, డీడీ డాక్టర్ వి.జయరాజ్, డీడీ డాక్టర్ జగన్నాథం, ఏడీ డాక్టర్ పోతనపల్లి చంద్ర శేఖరం, ఏడీ డాక్టర్ రాజగోపాల్, ఏడీ డాక్టర్ ఆనందరావు, డాక్టర్ శ్రీకాంత్, డాక్టర్ ఉమాభారతి, డాక్టర్ పాపారావు, డాక్టర్ రమణ, డాక్టర్ మధుబాబు, డాక్టర్ కళ్యాణ్ సిబ్బంది పాల్గొన్నారు.

ముగిసిన బాస్కెట్‌బాల్ టోర్నమెంట్



విజేతలతో ఎమ్మెస్సార్, డీటీ బీవీవీఎన్ రాజు సంఘ ప్రతినిధులు

శ్రీకాకుళం న్యూకాలనీ: మూడు రోజుల పాటు కన్నుల పండువగా సాగిన శ్రీకాకుళం నగర పరిధి బాస్కెట్‌బాల్ పోటీలు సోమవారం రాత్రితో ముగిశాయి. మూడు రోజులపాటు ఫ్లడ్‌లైట్ల వెలుతురులో శ్రీకాకుళం నగరంలోని ఎన్టీఆర్ మున్సిపల్ కార్పొరేషన్ హైస్కూల్ మైదానం వేదికగా ఈ పోటీలు జరిగాయి. ఈ పోటీల్లో విజేతలుగా నిలిచిన జట్లకు శ్రీకాకుళం మండల డిప్యూటీ తహసీల్దార్ బీవీవీఎన్ రాజుతో కలిసి బాస్కెట్‌బాల్ అసోసియేషన్ జిల్లా చైర్మన్ ఎమ్మెస్సార్ కృష్ణమూర్తి బహుమతులు, పతకాలు, ప్రశంసా పత్రాలు అందజేశారు. 10 నుంచి 18 ఏళ్లలోపు వయో విభాగంలో బ్లెస్సింగ్ బ్లూస్ విజేతగా నిలవగా, బ్లాక్ బుల్స్ రన్నరప్‌గా, రెడ్ రైడర్స్ తృతీయ స్థానంలో నిలిచింది. 10 ఏళ్ల లోపు వయో విభాగంలో చార్మింగ్ బ్లూస్ విన్నర్‌గా, ఆరెంజ్ వారియర్స్ జట్టు రన్నరప్ నిలిచాయి. అనంతరం మైదానంలో క్రీడాకారులతో కలిసి అంతర్జాతీయ వెటరన్ అథ్లెట్ ఎండీ ఖాసీంఖాన్ జన్మదిన వేడుకలతోపాటు నూతన సంవత్సర వేడుకలను ఎమ్మెస్సార్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా బాస్కెట్‌బాల్ గేమ్ ద్వారా ఉద్యోగాలు పొందిన ఎండీ హాఫీజ (పోలీసు– దిశ పోలీస్ స్టేషన్ శ్రీకాకుళం), సచివాలయ ఉద్యోగం సాధించి జయచంద్రలను సత్కరించారు. బాస్కెట్‌బాల్‌కు మూడు దశాబ్దాలకు విశేషంగా సేవలు అందిస్తున్న ఎమ్మెస్సార్, కోచ్ అర్జున్‌రావురెడ్డిలను క్రీడాకారులు, తల్లిదండ్రులు ఘనంగా సన్మానించా రు. పోటీలను విజయవంతం చేసిన ప్రతి ఒక్కరికి ఎమ్మెస్సార్ కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో సెపక్‌తక్రా అసోసియేషన్ జిల్లా ఉపాధ్యక్షుడు ఎస్వీడీ మురళి, అమరావతి శ్రీనివాస్, బి.సోములు, వేణుగోపాల్, ఎండీ కళావతి, గణేష్, రమణ, సంఘ ప్రతినిధులు, క్రీడాకారుల తల్లిదండ్రులు, తదితరులు పాల్గొన్నారు.

హాలికులకు సహాయకులుగా..



మెళియాపుట్టిలో పొలంబడి నిర్వహిస్తున్న వీఏఏలు

- రైతన్నలకు అండగా నిలుస్తున్న వీఏఏలు
- గ్రామాల్లో చురుగ్గా పనిచేస్తున్న వ్యవసాయ సహాయకులు
- రాయితీలు, రుణాలు, పథకాలపై అన్నదాతలకు సహాయ సహకారాలు

మెళియాపుట్టి: హలధారులకు సలహాలు ఇస్తూ గ్రామ వ్యవసాయ, ఉద్యాన సహాయకులు తమ పనిని సమర్థంగా నిర్వర్తిస్తున్నారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం వచ్చాక రైతులకు అండగా ఉండేందుకు వ్యవసాయంలో వినూత్నమైన మార్పులు తీసుకొచ్చింది. దీనిలో భాగంగానే రైతు భరోసా కేంద్రాలను ఏర్పాటు చేసింది. ఈ కేంద్రాల్లో ఉంటూ రైతులకు అవసరమైన సూచనలు అందించేందుకు వీఏఏలను నియమించింది. రైతులకు విత్తనాల పంపిణీ నుంచి పంట విక్రయం వరకు అన్ని రకాల సేవలు వీరు అందిస్తున్నారు.

రాయితీ విత్తనాలు, ఎరువులు, పురుగు మందులు, భూసార పరీక్షలు నిర్వహిస్తున్నారు. రైతుభరోసా పథకం ద్వారా వ్యవసాయానికి కావాల్సిన పెట్టుబడులు, పీఎం కిసాన్, వ్యవసాయ యాంత్రీకరణ, వ్యవసాయ రుణాలు, పంటల బీమా పథకం అమలుతో పాటు ధాన్యం కొనుగోలు మొదలైన సేవల్లో రైతులకు సహాయ సహకారాలు అందజేస్తున్నారు.

60 శాతం మహిళలే

జిల్లావ్యాప్తంగా ఉన్న ఆర్‌బీకేల్లో ఉన్న వీఏఏల్లో 60 శాతం మంది మహిళలే ఉన్నారు. ప్రభుత్వ నియామకాల్లో వారికి దగ్గరగా ఉన్న గ్రామాల్లో యువతీ యువకులు ఉద్యోగులుగా ఎంపిక కావడం, ఎక్కువ మందివి రైతు కుటుంబాలే కావడంతో విధులు సమర్థంగా నిర్వహిస్తున్నారు. రైతుల సమస్యలు పరిష్కారమవుండటంతో వారు కూడా ఆనందం వ్యక్తం చేస్తున్నారు. జిల్లా వ్యాప్తంగా 530 మంది వీఏఏలుగా పనిచేస్తున్నారు.



గొప్పిలి గ్రామంలో రైతులకు పురుగుల నివారణపై అవగాహన కల్పిస్తున్న వీఏఏ పావని

సందేహాల నివృత్తి చేస్తున్నాం



గ్రామాల్లో వారి పొలం వద్దకే వెళ్లి వారికి సహాయకారిగా ఉంటూ.. వారి సమస్యలను పరిష్కరిస్తూ పనిచేయడం ఆనందంగా ఉంది. ప్రభుత్వం నుంచి వస్తున్న రాయితీలు, విత్తనాలు పంపిణీ చేస్తున్నప్పుడు రైతు కళ్లలో సంతోషం చూస్తుంటే చాలా సంతృప్తిగా ఉంటుంది.

– జయలక్ష్మి, వ్యవసాయ సహాయకులు, పట్టుపురం సచివాలయం, మెళియాపుట్టి మండలం

అవగాహన ఉంది

నేను గిరిజన గ్రామంలో పుట్టి చిన్నప్పటి నుంచి వ్యవసాయ పనుల్లో తల్లిదండ్రులకు సహాయసహకారాలు అందించాను. వ్యవసాయంపై నాకు అవగాహన ఉంది. రైతులకు సేవలందించే ఉద్యోగంలో చేరి ప్రభుత్వం అందిస్తున్న పథకాలను రైతులకు చేరువ చేస్తూ.. రైతులకు ఆధునిక వ్యవసాయ పద్ధతులపై నిత్యం అవగాహన కల్పిస్తున్నాం. చాలా సంతోషంగా ఉంది.

– ఝాన్సీ, వ్యవసాయ సహాయకులు, సిరియాఖండి సచివాలయం, మెళియాపుట్టి

కార్యాలయాల చుట్టూ తిరిగే బాధ తప్పింది



కార్యాలయాల చుట్టూ తిరగకుండా వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ప్రభుత్వం ఆర్‌బీకేలను ఏర్పాటు చేసింది. వ్యవసాయ సహాయకుల ద్వారా సేవలు అందించడం సంతోషంగా ఉంది. గతంలో విత్తనాల కొనుగోలు నుంచి పంట విక్రయం వరకు కార్యాలయాల చుట్టూ తిరిగేవాళ్లం. ఒక్కోసారి రోజంతా ఎదురు చూసినా అధికారులు కలిసేవారు కారు. ఇప్పుడు ఆ అవస్థలు లేవు.

– కవిటి రామస్వామి, రైతు పట్టుపురం గ్రామం, మెళియాపుట్టి మండలం

క్లుప్తంగా

అంగన్‌వాడీలు సమ్మె విరమించాలి: కలెక్టర్

శ్రీకాకుళం పాతబస్టాండ్: అంగన్‌వాడీ కార్యకర్తలు, సహాయకులు సమ్మెను విరమించి వెంటనే విధుల్లో చేరాలని ప్రభుత్వం విజ్ఞప్తి చేస్తోందని కలెక్టర్ శ్రీకేష్ బి.లాఠకర్ సోమవారం ఓ ప్రకటన విడుదల చేశారు. కార్యకర్తలు 11 డిమాండ్లతో సమ్మె చేస్తున్నారని అయితే త్రైమాసిక టీడీ, డీఏలు, పెండింగ్‌లో ఉన్న అద్దెలు, కూరగాయలు ఇతర ఖర్చులు చెల్లించేందుకు ప్రభుత్వం జీఓను ఇప్పటికే విడుదల చేసిందని పేర్కొన్నారు. మరిన్ని సమస్యలు దశల వారీగా పరిష్కరించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని ఆయన వివరించారు. గర్భిణులు, బాలింతలకు కావాల్సిన పౌష్టికాహారాన్ని అందజేయాలని, దీనికి అంగన్‌వాడీ సిబ్బంది సహకరించాలని కోరారు. సిబ్బంది విధులకు హాజరు కాకపోవడం వల్ల గర్భిణులు, చిన్నారులు, బాలింతలకు పౌష్టికాహారం అందడం లేదని తెలిపారు. సమ్మె విరమణకు కేబినెట్ మంత్రులు, అధికారులు దఫదఫాలుగా చర్చలు జరిపారని, అయితే వెంటనే ఈ శాఖలో ఉన్న సిబ్బంది అందరూ సహచరులకు ఎస్ఎంఎస్‌ల ద్వారా తెలియజేసి, తక్షణం సమ్మెను విరమించాలని కలెక్టర్ కోరారు. ఈ నెల 5వ తేదీ లోగా విధుల్లోకి చేరి, సేవలు అందించాలని సూచించారు. విధుల్లోకి చేరని వారిపై ప్రభుత్వ నిబంధనల మేర శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు.

భక్తిశ్రద్ధలతో తిరుప్పావై సేవ



స్వామివారికి వడలతో నైవేద్యం పెట్టిన భక్తులు

సారవకోట: మండలంలోని చీడిపూడి వెంకటేశ్వర స్వామి ఆలయంలో సోమవారం భక్తిశ్రద్ధలతో తిరుప్పావై సేవను నిర్వహించారు. ధనుర్మాస ఉత్సవాలలో భాగంగా ఈ కార్యక్రమం నిర్వహించినట్లు అర్చకులు రామానుజాచార్యులు తెలిపారు. తిరుపతి ఏడు కొండలులో ఒక్కొక్క కొండకు ఉన్న పేర్ల మేరకు నైవేద్యాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. చీడిపూడి, అవలింగి, బుడితి గ్రామాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో స్వామి వారిని దర్శించుకున్నారు.

పెన్షన్ కానుక పెంపుపై అవగాహన



గిరిజనులకు అవగాహన కల్పిస్తున్న ఎమ్మెల్యే రెడ్డి శాంతి

కొత్తూరు: వైఎస్సార్ పెన్షన్ కానుక మొత్తాన్ని సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పెంచడంపై ఎమ్మెల్యే రెడ్డి శాంతి పలువురు గిరిజనులకు అవగాహన కల్పించారు. కొత్తూరు మండలం అల్తి పంచాయతీ తామరగూడ గిరిజన గ్రామంలో పెన్షన్ మొత్తం పెంపుపై సోమవారం అవగాహన సదస్సు నిర్వహించారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు ఈ నెల నుంచి పింఛన్ మొత్తాన్ని రూ.2750 నుంచి రూ. 3000లకు పెంచినట్లు చెప్పారు. పార్టీలకు అతీతంగా అర్హతే ప్రామాణికంగా పింఛన్లు అందిస్తున్నారని గుర్తు చేశారు. టీడీపీ ప్రభుత్వంలో పింఛన్ మంజూరు చేయాలంటే ముందుగా జన్మభూమి కమిటీలను కలిస్తే తప్ప మంజూరయ్యేవి కావని తెలిపారు. కార్యక్రమంలో గ్రామ సచివాలయం మండల కన్వీనర్ గండివలస ఆనందరావు, మండల కార్యదర్శి పంకజదాస్‌లతో పాటు పలువురు పార్టీ నేతలు పాల్గొన్నారు.

సర్వేపల్లి రాధాకృష్ణన్ విగ్రహావిష్కరణ



సర్వేపల్లి విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న దృశ్యం

కొత్తూరు: మండలంలోని కర్లెమ్మ ప్రాథమిక పాఠశాల ఆవరణలో భారతరత్న సర్వేపల్లి రాధాకృష్ణన్ విగ్రహాన్ని సోమవారం రామరాజు చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్, జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత పారిశిల్లి రామరాజు ఆవిష్కరించారు. ఎద్దు సుందర నారాయణ వరహాలమ్మ చారిటబుల్ ట్రస్టు సౌజన్యంతో ఎద్దు అంబిరేష్ నాయుడు జ్ఞాపకార్థం ఆయన తల్లిదండ్రులు ఎద్దు గోపాలదాసు నాయుడు, నారాయణమ్మ ఈ విగ్రహాన్ని ఏర్పాటు చేశారు. అనంతరం విద్యార్థులకు దుస్తులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ట్రస్టు సభ్యులు ఎద్దు కన్నం నాయుడు, హెచ్ఎం శ్రీదేవి, విశ్రాంతి ఉపాధ్యాయులు సీతారామమూర్తి, వసంతరావు, కృష్ణారావులతో పాటు పలువురు పాల్గొన్నారు.



శ్రీకాకుళం రూరల్: క్యాంపు కార్యాలయంలో జరిగిన కొత్త ఏడాది వేడుకల్లో కుమారుడు రామ్‌మనోహర్‌నాయుడుకు కేక్ తినిపిస్తున్న మంత్రి ధర్మాన ప్రసాదరావు



ఆమదాలవలస: స్పీకర్ క్యాంపు కార్యాలయంలో అభిమానుల మధ్య కేక్ కట్ చేస్తున్న స్పీకర్ తమ్మినేని సీతారాం



కాశీబుగ్గ: మంత్రి క్యాంపు కార్యాలయంలో కుటుంబ సభ్యులు, అభిమానుల మధ్య కేక్ కట్ చేస్తున్న రాష్ట్ర మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు

నూతన ఉత్సాహం

న్యూ ఇయర్ వేడుకలను జిల్లా సంబరంగా జరుపుకుంది. ప్రజా ప్రతినిధుల ఇళ్లు సందడిగా మారాయి. పార్టీ కార్యకర్తలు, అభిమానులు వెళ్లి తమ అభిమాన నాయకులకు శుభాకాంక్షలు తెలిపారు. కేక్‌లు కట్ చేసి ఆనందంగా గడిపారు.

యాజమాన్య పద్ధతులతోనే

అధిక దిగుబడులు

- మామిడి, జీడి మామిడికి పూత దశలో జాగ్రత్తే కీలకం
- ఉద్యానవన ఏడీ రత్నాల వరప్రసాద్



రత్నాల వర ప్రసాద్

శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ): జీడి మామిడి, మామిడిలో యాజమాన్య పద్ధతులు కీలకమని, రైతులు వీటిపై అవగాహన పెంచుకోవాలని జిల్లా ఉద్యాన అధికారి రత్నాల వర ప్రసాద్ సూచిస్తున్నారు. అన్నదాతకు చక్కటి ఆదాయ వనరులు సమకూర్చే పంటల్లో ఇవి రెండూ ప్రధానమైనవి. జిల్లాలో మామిడి కన్నా జీడి మామిడి ఎక్కువగా సాగవుతుంది. మామిడి కన్నా జీడి మామిడికి మార్కెట్ సదుపాయం ఉండడంతో ఎక్కువగా దీనిపైన జిల్లా రైతులు ఆధారపడుతున్నట్లు ఏడీ పేర్కొంటున్నారు. ఈ పంటలు అధిక దిగుబడులు ఇవ్వాలంటే పూత దశలో రైతులు తగిన జాగ్రత్తలు తీసుకోవాల్సి ఉంటుందన్నారు. ప్రస్తుతం జిల్లాలో జీడి మామిడి 52 వేల ఎకరాలు, మామిడి 5 వేల ఎకరాల్లో సాగు చేస్తున్నారని తెలిపారు. శీతాకాలంలో పూతకు వచ్చే మామిడిపై వాతావరణం ఉష్ణోగ్రతల హెచ్చుతగ్గులు, దట్టమైన పొగమంచు ప్రభావం అధికంగా ఉంటుందన్నారు. దీంతో వచ్చి పూత ముడుచుకుపోయి దిగుబడి భారీగా తగ్గే అవకాశం ఉంటుందని తెలిపారు. ఆయన తెలిపిన సూచనల మేరకు..

ఈ శీతల పరిస్థితుల్లో నాఫ్తలిన్ ఎసిటిక్ ఆమ్లాన్ని (ప్లానో ఫిక్స్) నీటిలో కలిపి చెట్టు బాగా తడిసేలా పిచికారీ చేయాలి. దీనివల్ల పూత పూర్తిగా విచ్చుకుని పిందెలు కట్టే అవకాశం ఉంటుంది. మామిడిలో పూత దశలో ఆశించే పురుగుల్లో తేనె మంచు పురుగు ప్రత్యేకం. వీటి వల్ల నష్టం ఎక్కువగా నవంబర్ నెల నుంచి మార్చి నెలాఖరు వరకు ఉంటుంది. తేనె మంచు పురుగు సోకిన తోటల్లో తేనె వంటి పదార్థం ఆకులపై ఏర్పడి చిగుర్లు ముడుచుకుపోయి పంటపై తీవ్ర ప్రభావం చూపే అవకాశం ఉందన్నారు. తేనె మంచు నివారణకు తోటల్లో నీరు నిలువకుండా ఉంటే వీటి ఉధృతి తక్కువగా ఉంటుందని లీటరు నీటికి క్లోరిపైరిఫాస్ 2.5 మిల్లీలీటర్లు, ఫాస్ఫామిన్ 0.5 మిల్లీలీటర్లు కలిపి పూత ఆకులపైనే కాకుండా మొదళ్ల పైన కొమ్మల పైన కూడా పిచికారీ చేయాలి. ఎక్కడైనా బూడిద తెగులు ఆనవాళ్లు కనిపిస్తే వెంటనే హెక్సాకొనజోల్ 2 మిల్లీలీటర్లు లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలి.

జీడి మామిడి తోటలో..

జీడి మామిడిలో కాండం, వేరు తొలుచు పురుగు, పుష్ప గుచ్ఛాలను ఆశించే టీ దోమ ముఖ్యమైనవి. ముదురు తోటలపై తెగుళ్ల ప్రభావం చూపే అవకాశం ఎక్కువగా ఉంటుంది. అందుకే ఏడేళ్లు, ఆ పై వయస్సుగల చెట్ల కాండం మొదలు, భూమి పైన కనపడే వేర్లు, సన్నని ఇనుప వైరుతో చేసిన బ్రష్‌తో బాగా రుద్ది ఆ తర్వాత బాగా తడిచేలా 5 శాతం వేప నూనె ద్రావణాన్ని నాలుగు నెలలకోసారి చొప్పున సంవత్సరంలో మూడు సార్లు పిచికారీ చేయాలి. వేప నూనె నీటిలో కరగదు. కాబట్టి ప్రతి లీటరు నీటికి 0.5 గ్రాములు సబ్బు కానీ, సర్ఫ్ గానీ కలిపి గిలకొట్టి 50 మిల్లీలీటర్ల వేప నూనెను కలిపి బాగా కలిసేటట్లు పుల్లతో కలియబెట్టాలి. ఈ పురుగు ఆశించే చెట్ల నుంచి బంక కారుతూ ఉంటుంది వెంటనే బెరడు కింద దాగి ఉన్న లద్దె పురుగులను తొలగించాలి. బెరడు చెక్కిన చోట వెంటనే కార్బరిల్ 4.0 గ్రాములు లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలి. ఈ పురుగులను తొలగిస్తే క్రమేణా చెట్లు చనిపోతాయి. చెక్కిన బెరడు ముక్కలను కాండం నుంచి కారిన బంకను చెక్క పొడిని భూమిలో పాతి పెట్టాలి. తోటలను పరిశుభ్రంగా ఉంచాలి. తుది దశలో పురుగులు సోకిన చెట్ల ఆకులు పసుపు రంగుగా మారతాయి. ఆ తర్వాత ఆకులన్ని రాలి మోడు వారి ఎండిపోయి.. చనిపోతాయి. కాబట్టి ఆకులు పూర్తిగా పసుపు రంగుకు మారగానే చెట్లను వెంటనే వేర్లతో సహా తీసివేసి వేర్లలో దాగి ఉన్న ప్యూపాలను చంపి సమగ్ర సస్యరక్షణ చర్యలు చేపట్టాలి. టీ దోమ తల్లి, పిల్ల పురుగులు లేత కొమ్మలను పూత రెమ్మలను ఆశించి రసాన్ని పీల్చడం వల్ల ఎర్రని జిగురు బిందువులు పూత రెమ్మలపై నల్లని పొడవైన కండే ఆకారపు మచ్చలు ఏర్పడతాయి. పూత, పిందెలు మాడిపోయి రాలిపోవటం వల్ల దిగుబడి తగ్గుతుందన్నారు. విపరీత పరిస్థితుల్లో చెట్లంతా మాడిపోయినట్లు అవుతుంది.



పూత దశలో ఉన్న జీడి

అవసరాన్ని బట్టి..

డిసెంబర్, మార్చి నెలల్లో అవసరాన్ని బట్టి రెండు, మూడు సార్లు పురుగు మందులను పిచికారీ చేసి అన్ని పురుగులను అదుపు చేయవచ్చు. మొదటిగా మోనోక్రోటోఫాస్‌ను డిసెంబర్-జనవరి లో (1.4 మిల్లీలీటర్లు/లీటరు), రెండవసారి ఎండోసల్ఫాన్‌ను జనవరి- ఫిబ్రవరిలో (1.4మిల్లీలీటర్లు/లీటరు), మూడో సారి అవసరమైతే కార్బాలను మార్చిలో 12 గ్రాములు లీటరు) పిచికారి చేసి అన్ని రకాల పురుగులను అదుపులో ఉంచవచ్చు. పై మందులు కాక క్లోరిపైరిఫాస్ (2.5 మిల్లీలీటర్లు/లీటరు) ప్రొఫెనోఫాస్ (1.0 మిల్లీలీటర్లు/లీటరు) నీటికి కూడా వాడుకోవచ్చని ఏడీ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ఆటో డ్రైవర్ దుర్మరణం



మృతదేహం వద్ద రోదిస్తున్న తల్లి

ఎచ్చెర్ల క్యాంపస్: ఫరీదుపేట పంచాయతీ కొయ్యరాళ్ల సమీపంలో జాతీయ రహదారిపై సోమవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో పేడాడ లక్ష్మణరావు (24) అనే ఆటో డ్రైవర్ మృతి చెందాడు. లక్ష్మణరావు ఆటో నడుపుతుంటాడు. సోమవారం శ్రీకాకుళం వైపు వెళ్తుండగా కొయ్యరాళ్ల జంక్షన్ సమీపంలో ఆగి ఉన్న లారీని వెనుక నుంచి ఢీకొట్టాడు. దీంతో ఆటో ముందు భాగం నుజ్జునుజ్జయ్యింది. దీంతో లక్ష్మణరావు ఆటో ముందు క్యాబిన్‌లో తీవ్రంగా గాయపడి ఇరుక్కుపోయాడు. స్థానికులు శ్రమించి అతడిని ఆటో నుంచి బయటకు తీసేసరికి ఊపిరి లేదు. మృతునిది కేశవరావుపేట గ్రామం. వివాహం కాలేదు. సంఘటన స్థలానికి చేరుకున్న తల్లిదండ్రులు అప్పలనాయుడు, గోదారమ్మ కొడుకు మృతదేహాన్ని చూసి కన్నీరుమున్నీరయ్యారు. నూతన సంవత్సరం మొదటి రోజునే విషాదం చోటు చేసుకోవడంతో కేశవరావుపేటలో విషాదం అలముకుంది. ప్రమాదం జరిగిన సమయంలో ఆటోలో ప్రయాణికులు లేకపోవటంతో పెను ప్రమాదం తప్పింది. స్థానిక ఎస్ఐ వి.సత్యనారాయణ, పోలీస్ సిబ్బంది, జాతీయ రహదారి సిబ్బంది ట్రాఫిక్ క్రమబద్ధీకరించారు. అనంతరం మృతదేహాన్ని రిమ్స్‌కు తరలించారు.

వేడుకలో విషాదం



ప్రమాదంలో మృతి చెందిన రాజబాబు

గార: మండలంలోని కళింగపట్నం సమీపంలో ఆదివారం అర్ధరాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో బందరువానిపేటకు చెందిన రాయితీ రాజబాబు అనే వ్యక్తి మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాలు ప్రకారం.. రాజబాబు కళింగపట్నం పంచాయతీలోని తాన్‌సాహెబ్‌పేట నుంచి బందరువానిపేట న్యూ ఇయర్ శుభాకాంక్షలు చెప్పేందుకు వెళ్తుండగా ప్రమాదం జరిగింది. రోడ్డుపై తీవ్ర గాయాలతో పడి ఉన్న అతడిని స్థానికులు గమనించి పోలీసులకు సమాచారం అందజేశారు. అప్పటికే అతను మృతి చెంది ఉన్నాడు. సీఐ ఎస్.కామేశ్వరరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

సముద్రంలో మునిగి వీఓఏ మృతి



అజిత్‌కుమార్ (ఫైల్)

సోంపేట: మండలంలోని మామిడిపల్లి గ్రామానికి చెందిన మర్రి అజిత్ కుమార్ (51) సముద్రంలో మునిగి సోమవారం మృతి చెందారు. బారువ పోలీసులు, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం .. మర్రి అజిత్ కుమార్ మామిడిపల్లి గ్రామంలో స్వయం సహాయక సంఘాల వీఓఏగా పనిచేస్తున్నారు. సోమవారం న్యూ ఇయర్ సందర్భంగా బారువ బీచ్‌కు వెళ్లారు. అక్కడే స్నానం చేస్తూ గల్లంతైపోయారు. అనంతరం గొల్లగండి తీరానికి అజిత్ కుమార్ మృతదేహం చేరింది. మృతునికి భార్య శైలజ, కుమారుడు, కుమార్తె ఉన్నారు. భార్య శైలజ ఫిర్యాదు మేరకు బారువ ఎస్ఐ చిరంజీవి కేసు నమోదు చేసి దర్యాప్తు చేపడుతున్నారు.

వీఓఏ మృతితో గ్రామంలో విషాద ఛాయలు అలుముకున్నాయి. ఎంపీపీ డాక్టర్ నిమ్మన దాస్, జెడ్పీటీసీ తడక యశోద, సర్పంచ్ పాతిన శేషగిరి, ఎంపీటీసీ మాదవరావు, స్వయ సహాయక సంఘ సభ్యులు కుటుంబానికి సంతాపం తెలిపారు.

హిజ్రాను బలికొన్న ట్రాక్టర్



లచ్చయ్యపేట గ్రామ జంక్షన్ వద్ద మృతి చెందిన వైశాలి

బూర్జ: మండలంలో గల లచ్చయ్య పేట కూడలి ప్రధాన రహదారి వద్ద సోమవారం రాత్రి స్కూటీపై వెళ్తున్న వైశాలి(35)ని ట్రాక్టర్ ఢీకొనడంతో ఆమె అక్కడికక్కడే మృతి చెందారు. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. వైశాలి ఓ హిజ్రా. ప్రతి రోజు ఆమదాలవలస నుంచి మన్యం జిల్లా పాలకొండ, బూర్జ మండలం కొల్లివలస జంక్షన్‌లో షాపుల వద్దకు వెళ్లి డబ్బులు వసూలు చేస్తుండేవారు. సోమవారం కూడా పాలకొండ నుంచి కొల్లివలస వచ్చి తిరిగి ఆమదాలవలసకు స్కూటీపై వెళ్తుండగా లచ్చయ్యపేట జంక్షన్ వద్ద ఎదురుగా వస్తున్న ట్రాక్టర్ ఢీకొట్టింది. దీంతో ఆమె ఘటనా స్థలంలోనే చనిపోయారు. స్థానికుల ఫిర్యాదు మేరకు స్థానిక ఎస్ఐ బి.అశోక్‌బాబు కేసు నమోదు చేశారు. మృతదేహాన్ని పాలకొండ ఏరియా ఆస్పత్రికి తరలించారు.

రైలు కింద పడి ఇద్దరు ఆత్మహత్య

- తెలంగాణలోని మిర్యాలగూడ స్టేషన్ సమీపంలో ఘటన
- మృతులిద్దరూ పోలాకి మండలవాసులు

పోలాకి: తెలంగాణలోని నల్గొండ జిల్లా మిర్యాలగూడ రైల్వేస్టేషన్ సమీపంలోని రైల్వేట్రాక్‌పై పోలాకికి చెందిన ఇద్దరు ఆత్మహత్య చేసుకున్నట్లు అక్కడి రైల్వేపోలీసుల ద్వారా సోమవారం పోలాకి పోలీసులకు సమాచారం అందింది. గ్రామానికి చెందిన వివాహిత పోతల ఆదిలక్ష్మి(30) మబగాం గ్రామానికి చెందిన సతివాడ గోవిందరావు(20) లు రైలు కింద పడి ఆత్మహత్య చేసుకున్నట్లు రైల్వే పోలీసులు గుర్తించారు. మృతురాలు ఆదిలక్ష్మికి భర్త ముకుందరావు, ఇద్దరు కుమారులు ఉన్నారు. గోవిందరావు కోతమిషన్ ఆపరేటర్‌గా పనిచేస్తుంటాడు. నల్గొండ జీఆర్‌పీ పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదు చేసి, మృతదేహాలను పోస్టుమార్టంకు తరలించినట్లు అక్కడి పోలీసులు తెలిపారు.

పేలిన బైక్ టైరు: వ్యక్తి మృతి

టెక్కలి రూరల్: మండలంలోని కె.కొత్తూరు గ్రామ జాతీయ రహదారిపై సోమవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో అదే గ్రామానికి చెందిన పాణిల గంగయ్య అనే వ్యక్తి మృతి చెందారు. స్థానికులు తెలిపిన వివరాలు ప్రకారం.. గంగయ్య తన ద్విచక్ర వాహనంపై టెక్కలి వెళ్లి పనులు ముగించుకుని తిరిగి వస్తుండగా అప్రోచ్ రోడ్డు దాటాక బైక్ టైర్ పేలడంతో బండి అదుపు తప్పింది. దీంతో ఆయన కింద పడగా తలకు దెబ్బ తగిలింది. గాయపడిన వ్యక్తిని హుటాహుటిన టెక్కలి జిల్లా ఆస్పత్రికి తరలించారు. అక్కడి నుంచి శ్రీకాకుళం రిమ్స్‌కు రిఫర్ చేశారు. అక్కడకు 108పై తరలిస్తున్న క్రమంలో కోటబొమ్మాళి సమీపంలో మృతి చెందారు. ఈయన తాపీమేస్త్రీగా పనిచేస్తుంటారు. మృతుడికి మృతుడు భార్య సుజాత, ఇద్దరు పిల్లలు ఉన్నారు. ఈ ఘటనపై టెక్కలి ఎస్ఐ-2 రమేష్‌బాబు వివరాలు సేకరించి కేసు నమోదు చేయనున్నట్లు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో విద్యార్థికి గాయాలు

టెక్కలి రూరల్: స్థానిక ఆది ఆంధ్ర వీధిలో గల గిరిజన ఆశ్రమ పాఠశాలలో 9వ తరగతి చదువుతున్న నాయుడు ప్రదీప్ రోడ్డు ప్రమాదంలో గాయపడ్డాడు. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాలు ప్రకారం.. ఎగువ బందపల్లి గ్రామానికి చెందిన ప్రదీప్ 31వ తేదీ రాత్రి బైక్‌పై తన గ్రామానికి వెళ్తుండగా గూడేం గ్రామ సమీప మలుపు వద్ద ద్విచక్రవాహనం అదుపు తప్పి విద్యుత్ స్తంభాన్ని ఢీకొట్టింది. దీంతో తీవ్రంగా గాయపడిన విద్యార్థిని స్థానికులు టెక్కలి జిల్లా ఆస్పత్రికి తరలించారు. అక్కడి నుంచి మెరుగైన వైద్యం కోసం శ్రీకాకుళం రిమ్స్‌కు తరలించారు. ఈ ఘటనపై టెక్కలి ఎస్ఐ-2 రమేష్‌బాబు కేసు నమోదు చేశారు.

నేటి నుంచి అక్రిడేటెడ్ జర్నలిస్టులకు బస్సుపాసులు

శ్రీకాకుళం క్రైమ్ : అక్రిడేటెడ్ జర్నలిస్టులు ఏపీఎస్ ఆర్టీసీ బస్సు పాసులను మంగళవారం నుంచి రెన్యువల్ చేసుకోవచ్చు. ఈ మేరకు జిల్లా ప్రజా రవాణా అధికారి (డీపీటీవో) ఎ.విజయ్ కుమార్ ఓ పత్రికా ప్రకటన విడుదల చేశారు.

భామినిలో తిష్టవేసిన ఏనుగులు

భామిని: భామిని మండల కేంద్రంలో నాలుగు ఏనుగుల గుంపు సోమవారం సంచరించింది. భామినికి చెందిన లక్ష్మీపతినాయుడుకు చెందిన చెరకు తోటలో తిరుగుతూ పంటను నష్టపరిచాయి. తివ్వాకొండ నుంచి దిగివచ్చిన ఏనుగుల గుంపు ఒడిశావైపు వెళ్లేందుకు వంశధార వరదకాలువ అడ్డంగా ఉండడంతో కొండ సమీపంలోనే ఉండిపోతాయని రైతులు భయాందోళన చెందుతున్నారు.

దాతలు దిగి వచ్చిన వేళ



రంగోయిలో పదో తరగతి చిన్నారులకు స్టడీమెటీరియల్ అందిస్తున్న గేదెల రామారావు, గ్రామ పెద్దలు

కాశీబుగ్గ: నూతన సంవత్సర వేళ దాతలు తమ సహృదయతను చూపించారు. కాశీబుగ్గ వైశ్యసంఘం ఆధ్వర్యంలో 50 మంది నిరుపేదలకు నిత్యావసర కిట్లు పంపిణీ కార్యక్రమం కన్యకాపరమేశ్వరి ఆలయంలో సోమవారం నిర్వహించారు. పలాస సత్యసాయి మందిరం తరపున చిన్నారులు బస్టాండ్, రైల్వేస్టేషన్ పరిసర ప్రాంతాలలో ఉన్న అనాథలు, యాచకులకు అల్పాహారాన్ని అందించారు. పలాస మండలం రంగోయి గ్రామంలో గేదెల రామారావు 78 మంది హైస్కూల్ పదో తరగతి చిన్నారులకు మోడల్ పేపర్‌లతో కూడిన స్టడీ మెటీరియల్ పుస్తకాలు అందించారు.

బుల్లి క్యాలెండర్లు



పోస్టుకార్డుపైన చక్రం బొమ్మ రూపంలో 2024వ సంవత్సరపు క్యాలెండర్



అరచేతిలో పోస్టుకార్డు పైన 2024వ సంవత్సరపు క్యాలెండర్

కంచిలి: మండలంలోని బూరగాం గ్రామానికి చెందిన ఉపాధ్యాయుడు, గణిత అవధాని మడ్డు తిరుపతిరావు ఏటా మాదిరిగానే 2024 సంవత్సర క్యాలెండర్‌ను అందరికీ సులభంగా అర్థమయ్యే రీతిలో రెండు విధాలుగా తయారు చేశారు.

మొదటి విధానం..

పోస్టుకార్డు పైన 12 అడ్డు గడులు, 7 నిలువ గడులతో రూపొందించిన క్యాలెండర్‌లో మొదటి 7 గడుల్లో 12 నెలల పేర్లు, వాటి కింద వారముల పేర్లు వరుసగా రాస్తూ, మిగతా 5 గడులలో 1 నుంచి 31 వరకు తేదీలను రాశారు. నెల తేదీలను సరిపోల్చుకుంటూ వారాన్ని తెలుసుకోవచ్చు.

రెండో విధానం:

పోస్టుకార్డుపైన చక్రం బొమ్మగీసి, అందులో 12 నెలల పేర్లు, వాటికెదురుగా కోడ్స్, మరో పటంలో వారాల పేర్లు, వాటి కోడ్స్ రాశారు. దీని ప్రకారం నెల కోడ్, తేదీకి కలిపితే 7 కంటే తక్కువ వస్తే డైరెక్ట్‌గా వారాల పట్టికలో చూస్తే సరిపోతుంది. 7 కంటే ఎక్కువ ఉంటే దాన్ని 7చేత భాగించాలి. శేషం ఎంత వస్తే ఆ అంకెకు ఎదురుగా ఉన్న రోజు అని అర్థం.

అయోధ్య రాముని అక్షింతల ఊరేగింపు



శ్రీరామ చిత్రపటాన్ని ఊరేగింపు చేస్తున్న భక్తులు

జి.సిగడాం: అయోధ్య నుంచి వచ్చి అక్షింతలను సోమవారం స్థానిక ఆంజనేయ స్వామి ఆలయం నుంచి రామమందిరం వరకు ఊరేగించారు. గెడ్డకంచరాం, డీఆర్‌వలస గ్రామాల్లోనూ ఊరేగించారు. అనంతరం అక్షింతలను అందరికీ పంపిణీ చేశారు. భక్తులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.